నాన్న కోటలో..

అభ్యర్థులను గెలిపించేందుకు ప్రత్యర్థులుగా ఇద్దరు

అక్కా వర్సెస్ తమ్ముడు!

జూబ్లీహిల్స్‌లో పీజేఆర్ వారసుల పోరాటం

అభిమానులను కలుపుకుంటూ ప్రచారం

ప్రత్యర్థులను తట్టుకొని నిలబడగలరా?

బంజారాహిల్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆ నియోజకవర్గానికి ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించిన చరిత్ర దివంగత పీజేఆర్‌కు ఉంది. ప్రత్యర్థులను కూడా తన వాళ్ల చేసుకొని రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పీజేఆర్ వారసులు ఇప్పుడు ఆదిపత్యం కోసం పోరాడుతున్నారు. ఇద్దరు కూడా తాము పనిచేస్తున్న పార్టీలను గెలిపించే బాధ్యత భుజాన వేసుకున్నారు. ఎన్నికల బరిలో దిగి ప్రచారాలు మొదలు పెట్టారు. ప్రత్యర్థులను తట్టుకొని వారసత్వాన్ని నిలుపుకునేందుకు ప్రత్యక్షంగా పోరాటం చేస్తున్నారు. తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న పీజేఆర్ రాజకీయ వారసుడిగా ఆయన కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి పార్టీలోనే ఉన్నప్పటికీ రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మరో వారసురాలు బీఆర్‌ఎస్ టికెట్టుపై పోటీ చేసి కార్పొరేటర్‌గా విజయం సాధించాక రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఇప్పుడు ఇద్దరూ కలిసి నాన్న కోట అయిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నమ్మిన పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇద్దరు కూడా పీజేఆర్ వారసత్వాన్ని నిలుపుకుంటారా? లేదా? అనే దానిపై ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

సందర్భం ఏదైనా.. చర్చ ఆయనదే..

నగర రాజకీయాల్లో ఆయనది చెరగని ముద్ర. పేదలు, మధ్య, ధనిక వర్గాల్లో ఇప్పటికీ ఆయనంటే అభిమానం. అంతెందుకు మురికివాడల్లో ఆయన నామస్మరణ చేస్తే ఇప్పటికీ ఓట్లు పడతాయంటే నమ్మి తీరాల్సిందే. మేమే ఆయన వర్గీయులమని చెప్పుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బస్తీ ఓటర్లకు గాలం వేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆయనే పి.జనార్దన్‌రెడ్డి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో దివంగత నేత పీజేఆర్‌ది ఇప్పటికీ చెరగని ముద్ర. ఆయన హయాంలో ఏర్పాటైన బస్తీలు అనేకం. ఆయన పేరిట ఏకంగా దేవాలయమే వెలిసింది. ప్రతీ యేట ఇక్కడ పీజేఆర్ జయంతి రోజు పండుగలా వేడుకలు జరుగుతాయి. ఇప్పుడు రాజకీయ పార్టీల అభ్యర్థులకు కూడా ఆయనే దిశానిర్దేశకుడిగా మారారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని క్వారీ ప్రాంతంలో కబ్జాలు పెరిగిపోయాయి. అప్పటికే అక్కడ ఉన్న వలస వచ్చిన వారిని ఆక్రమణదారులు తరిమేస్తుండడంతో అప్పటి మంత్రి పీజేఆర్ అడ్డుకున్నారు. బస్తీలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. బస్తీవాసులంతా కలిసి పీజేఆర్ తల్లిదండ్రులు శివమ్మ, పాపిరెడ్డి పేరును నామకరణం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం ఎస్‌పీఆర్ హిల్స్‌గా గుర్తింపు వచ్చింది. పీజేఆర్ తరహాలో పనిచేసే వారికే ఇక్కడి ప్రాంతవాసులు ఓట్లు వేసి గెలిపిస్తుంటారు.

పీజేఆర్ మరణానంతరం..

పీజేఆర్ మరణించిన తర్వాత జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో పీజేఆర్ వారసులుగా కాంగ్రెస్ తరఫున పి.విష్ణువర్ధన్‌రెడ్డి మూడు దఫాలుగా అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేశారు. ఓ సారి విజయం సాధించారు. రెండుమార్లు ఓటమి చవి చూశారు. 2023 ఎన్నికల్లో పార్టీ ఆయనకు టికెట్టు కేటాయించకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, కాంగ్రెస్ అవకాశం లభించకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరిన విజయారెడ్డి గ్రేటర్ ఎన్నికల్లో అదే పార్టీ నుంచి రెండుమార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. 2018 నుంచి ఆమె ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ టికెట్టుపై ఆశలు పెట్టుకున్నారు. కానీ పార్టీ కేటాయించకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. అయితే, ప్రత్యక్ష ఎన్నికల్లో ఇద్దరు ఎప్పుడు కూడా ఎదురుపడలేదు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక రావడం, నానిమేషన్‌ల ప్రక్రియ మొదలవడంతో ఇప్పుడు అక్కా, తమ్ముడు ప్రత్యర్థులుగా ఉంటూ ప్రచారం నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికల బరిలో దిగిన మాగంటి సతీమణి సునీతకు మొదటి నుంచి పీవీఆర్ అండగా నిలబడ్డారు. అంతేకాదు గెలుపు బాధ్యతను భుజాన ఎత్తుకున్నారు. తాను ఎలాగైనా, మాగంటి కుటుంబాన్ని గెలిపిస్తానని బహిరంగంగా ప్రకటించాడు. పీజేఆర్ అభిమానులను, పార్టీ శ్రేణులను ఒక్క తాటి మీదకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ నవీన్‌యాదవ్‌కు టికెట్టు కేటాయించింది. ఈ నేపథ్యంలో నవీన్‌యాదవ్ మద్దతు కోరుతూ కార్పొరేటర్ విజయారెడ్డిని కలవడమే కాకుండా పీజేఆర్ యూనివర్సల్ నేత అని ప్రకటించాడు. అధిష్ఠానం కూడా నవీన్ గెలుపునకు కృషి చేయాలని విజయారెడ్డికి సూచించడంతో ఆమె వారం రోజులుగా జూబ్లీహిల్స్‌పై దృష్టి పెట్టారు. పీజేఆర్ కోసం పనిచేసిన వారిని కలుసుకుంటూ నవీన్‌కు మద్దతు సమకూర్చేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ప్రచారం చేస్తున్నారు. ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మాత్రమే కాదు, పీజేఆర్ వారసుల మధ్య కూడా పోటీ నెలకొందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి పీజేఆర్ వర్గం ఎటువైపు ఉంటుంది అనేది ఎన్నికల ఫలితాల తర్వాతే తెలుస్తుంది.


బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతకు మద్దతు ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి


కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కార్పొరేటర్ పి.విజయారెడ్డి


మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా శ్రీరామ్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

● బోరబండ, ఆంధ్రజ్యోతి


ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల కూడలి వద్ద నుంచి షేక్‌పేట్ మండల కార్యాలయం వరకు ర్యాలీగా కార్యకర్తలతో వెళ్లి నామినేషన్ వేసిన ప్రజా వెలుగు పార్టీ అభ్యర్థి ఎర్రోళ్ల ప్రవీణ్ కుమార్

● బోరబండ, ఆంధ్రజ్యోతి

నేడు యుగతులసి పార్టీ అభ్యర్థి నామినేషన్

ఖైరతాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో యుగతులసి పార్టీ తరఫున నామినేషన్ వేయనున్నట్లు కె.శివకుమార్ తెలిపారు. తెలంగాణలో గో హింస ఆగాలని, కబేళాలు మూసివేయాలని, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్న తమ పార్టీ గోవు గోస ప్రపంచానికి తెలియజేయాలనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని త్రిశక్తి హనుమాన్ దేవస్థానం నుంచి పెద్ద ఎత్తున గో భక్తులు, గో అభిమానులతో భారీ ఊరేగింపుగా బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు ఇస్తామని శివకుమార్ తెలిపారు.

అవయవ దానం.. ఆరుగురికి ప్రాణదానం


శ్రీనివాసులు(ఫైల్)

నిమ్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒకరి అవయవదానంతో ఆరుగురికి ప్రాణం పోశారు వైద్యులు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసులు(42) భవన నిర్మాణ మేస్త్రీ. ఈనెల 10వ తేదీన తాను పనిచేస్తున్న భవనం మూడో ఫ్లోర్ నుంచి కిందపడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. 15వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. జీవన్‌దాన్ వైద్యులు అవయవదానంపై శ్రీనివాసులు కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. అందుకు వారు అంగీకరించడంతో అతడి శరీరం నుంచి లివర్, రెండు కిడ్నీలు, గుండె, రెండు కార్నియాస్ సేకరించి ఆరుగురు వ్యక్తులకు ప్రాణదానం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

పంజాగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ నందినగర్, మీనాక్షి ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ సీఓడీ ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 11కేవీ ఆంధ్రా బ్యాంక్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ఖైరతాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సైఫాబాద్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. లక్డీకాపూల్‌లోని షా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందని ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని వారు పిలుపునిచ్చారు.


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు పుస్తకాలను అందజేస్తున్న సువర్చల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

పురాణ, ఇతిహాస గ్రంథాలు చదవాలి

● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

బంజారాహిల్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా భారత ఇతిహాసలు భవిష్యత్తు తరాలకు తెలుస్తాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఋషులు, మునులు రాసిన విజ్ఞాన ఘని లాంటి పురాణ, ఇతిహాస గ్రంథాలను యువత చదవాలని సూచించారు. జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో సువర్చల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం ఆయనను కలిశారు. సంస్థ ప్రచురించిన పుస్తకాలను అందజేశారు. భారతీయ ఇతిహాసాలతో పుస్తకాలను ప్రచురించి విదేశాల్లో వితరణ చేస్తునట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సి.రామకృష్ణ, ఎండీ సి.రవీంద్ర, ట్రస్ట్ అంతర్జాతీయ సంధాన కర్త, డా.కె.ధర్మారావు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూను సందర్శించిన స్వీడన్ బీటీహెచ్ వర్సిటీ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూతో రెండు దశాబ్దాల ప్రయాణం ఫలప్రదంగా కొనసాగుతోందని స్వీడన్‌లోని బీటీహెచ్ (బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) వైస్ చాన్స్‌లర్ హెన్రిక్ జాన్సన్ అన్నారు. ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ కోర్సుల కోసం జేఎన్‌టీయూతో ఎంఓయూ కుదుర్చుకొని 20ఏళ్లయిన నేపథ్యంలో వీసీ సహా పలువురు స్వీడన్ అధికారులు బుధవారం జేఎన్‌టీయూను సందర్శించారు. వీసీ హెన్రిక్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత పరిశోధనల కోసం రెండు సంస్థలు మరింత సహకారాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. అలాగే, జేఎన్‌టీయూ విద్యార్థులతో సమావేశమైన స్వీడన్ వర్సిటీ డిప్యూటీ వైస్ చాన్స్‌లర్ ఎవా లోఫ్‌స్టాల్ మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల పాటు జేఎన్టీయూలో చదివి ఏడాదిన్నర విద్యాభ్యాసం కోసం స్వీడన్ వచ్చిన విద్యార్థులు అద్భుతమైన పనితీరును కనబరుస్తున్నారని చెప్పారు. ఐడీడీఎంపీ కోర్సులోని పాఠ్యాంశాలు, స్వీడిష్ భాషా అవసరాలు, నివాస, పని అనుమతులు, ఉపాధి అవకాశాలు, పరిశ్రమల సహకారం, ఆవిష్కరణలకు సంబంధించిన విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు స్వీడన్ ప్రతినిధులు జవాబిచ్చారు. జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జేఎన్‌టీయూతో బీటీహెచ్ 20ఏళ్ల విద్యా సహకారాన్ని పూర్తి చేసుకోవడం చిరస్మరణీయ సందర్భమన్నారు. ఈ భాగస్వామ్యాన్ని భవిష్యత్తులో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బీటీహెచ్ ప్రతినిధుల బృందంతో జరిగిన సమావేశంలో జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వీడన్ ప్రతినిధుల బృందంతో పాటు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు.

'42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం'

పంజాగుట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం చేస్తామని బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ జాతీయ అధ్యక్షుడు పాలూరు రామకృష్ణయ్య అన్నారు. బుధవారం అఖిల గాండ్ల తెలికుల సంఘం ట్రస్టు భవన్‌లో పార్టీ తెలుగు రాష్ట్రాల కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఇందులో వివిధ అంశాలపై చర్చించారు. ప్రెస్ మీట్ పెట్టి పార్టీ జాతీయ అధ్యక్షుడి మీద అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా దుర్భాషలాడిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఐతగోని రాఘవేంద్రను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ తీర్మానించారు. సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మేకపోతుల నరేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, జాతీయ కోశాధికారి సి.లక్ష్మి, జాతీయ సమన్వయకర్త బెక్కం వెంకట్, ఏపీ అధ్యక్షుడు వి.శ్రీనివాసులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'ధార్మిక పరిషత్ బోర్డు ఏర్పాటు చేయాలి'

పంజాగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హిందూ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు, ఉద్యోగులకు భద్రత కల్పించాలని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ధార్మిక పరిషత్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని శ్రీ రామాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ అర్చక సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బి.రామశర్మ, అర్చకులతో కలిసి ఆయన మాట్లాడారు. దేవాదాయ శాఖలో వేలాదిమంది అర్చకులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని ఈ క్రమంలో కొంతమంది ఈర్ష్యాద్వేషాలతో హిందూ సమాజాన్ని కలుషితం చేయాలని, ఆలయల పరిపాలనలో జోక్యం చేసుకోవాలనే ఉద్దేశంతో కార్యనిర్వహణాధికారి, ఉద్యోగులు, అర్చకులపై లేనిపోని అబాండాలు వేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు పోలీసు కేసులు పెట్టి వాటి ద్వారా లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. వెంగళరావునగర్ శ్రీ రామాంజనేయస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న అర్చకుడిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టడం అన్యాయం అని అన్నారు. సమావేశంలో అర్చకులు వెంకటరత్నం, అంబా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల మద్దతుతో గెలుపు తథ్యం

● బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత


డ్వాక్రా సంఘం మహిళలతో సమావేశమైన మాగంటి సునీత


ఎర్రగడ్డలో ఇంటింటి ప్రచారం చేస్తున్న అక్షర, దిశిర

ఎర్రగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మహిళలు తనకు మద్దతు పలుకుతున్నారని, గెలుపు తథ్యం అని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని న్యూప్రేమ్‌నగర్ కాలనీలో ఆమె డ్వాక్రా సంఘం మహిళలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత నేత మాగంటి గోపీనాథ్ మహిళల పట్ల ఎంతో ఆదరాభిమానాలతో మెలిగే వారని గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి మద్దతుగా ప్రచారం

బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కుమార్తెలు మాగంటి అక్షర, దిశిర జరా గుల్షన్‌బాగ్ బస్తీలో ఇంటింటి ప్రచారం చేశారు. తమ తల్లిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

అలిగిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

● బుజ్జగించిన కార్పొరేషన్ల చైర్మన్లు


నవీన్ యాదవ్‌ను సన్మానిస్తున్న భవానీశంకర్

బోరబండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్నా, అధిష్ఠానం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని పార్టీ సీనియర్ నాయకుడు, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.భవానీ శంకర్ కినుక వహించారు. సొంత పార్టీ వాళ్లే తమపై కేసులు పెట్టి వేధిస్తున్నా పట్టించుకోవడం లేదని అలిగారు. పరిస్థితి ఇలాగే ఉంటే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తానంటూ రహ్మత్ నగర్‌లోని తన నివాసంలో బుధవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు. విషయం తెలిసిన వెంటనే జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పీజేఆర్ తనయ విజయారెడ్డి తదితరులు భవానీ శంకర్ నివాసానికి చేరుకొని సముదాయించారు. ఉపఎన్నిక సమయంలో పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్థానిక నాయకుడు పెట్టిన కేసు విషయం పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చిందని, త్వరలోనే కేసు ఉపసంహరించేలా చూస్తామని వారు సముదాయించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించిన వారు, ఇతర నాయకుల ఇళ్లకు వెళ్లిన రాష్ట్ర మంత్రులు తనను విస్మరించడం బాధ కలిగించిందని భవానీ శంకర్ తెలిపారు. కార్పొరేషన్ల చైర్మన్లు బుజ్జగించడంతో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పూర్తి సహకారం అందిస్తానని భవానీ శంకర్ చెప్పారు. సమస్య పరిష్కారం అయినందున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా కన్వీనర్‌గా శివశంకర్

ఎర్రగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్‌గా ఎర్రగడ్డకు చెందిన ఎస్.శివశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ విభాగం చైర్మన్ సాయిమధుకర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిమధుకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించడంలో కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం కీలకపాత్ర పోషించాలని సూచించారు. శివశంకర్ మాట్లాడుతూ పార్టీ నాయకులను జిల్లా పరిధిలో ఏకతాటిపై నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ నాగంగారి ప్రీతం, సికింద్రాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


శివశంకర్‌కు నియామకపత్రం ఇస్తున్న సాయిమధుకర్

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర గొప్పది


మహిళా కిసాన్ దివస్‌లో పాల్గొన్న డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, మహిళా అధికారులు

రాజేంద్రనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మహిళలు వెన్నెముక లాంటివారని, వీరి పాత్ర చాలా గొప్పదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.సాగర్ హనుమాన్ సింగ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో బుధవారం మహిళా కిసాన్ దివస్‌ను నిర్వహించారు. సంపన్న దేశం కోసం మహిళా రైతును సాధికారపరచడం అనే ఇతి వృత్తంతో మేనేజ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి 80 మంది మహిళా పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోజువారీ వ్యవసాయ కార్యకలాపాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్ వరకు అన్ని దశలలో చురుకుగా మహిళా రైతులు, మహిళా పారిశ్రామిక వేత్తలు పనిచేస్తున్నారన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలు, రైతులు నమ్మకంగా ముందుకు సాగాలన్నారు. కాన్ఫడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షురాలు, జాతీయ జాయింట్ సెక్రటరీ చేతనా జైన్ మాట్లాడుతూ, మహిళల నేతృత్వంలోని సంస్థలను బలోపేతం చేయడానికి వ్యాపార ఉత్పత్తులను ప్రదర్శించడం, సహకారాన్ని పెంపొందించడం వంటి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మహిళా రైతులు, పారిశ్రామికవేత్తలు మారుతున్న సమాజానికి అనుగుణంగా మారాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు భవ్యత బెన్, ఉజ్వల గణేశ్ రౌత్, డాక్టర్ వినీత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇనుప రాడ్డు తలపై పడి ఏసీ టెక్నీషియన్ మృతి

బోరబండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐదో అంతస్థు నుంచి ఇనుపరాడ్డు తలపై పడడంతో ఏసీ టెక్నీషియన్ మృతిచెందాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టిమ్స్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌కు చెందిన శివ్ పూజన్ పండిత్(47) ఏసీ ఇన్‌స్టాలేషన్ పనులు చేస్తుంటాడు. ఎర్రగడ్డ ప్రాంతంలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) ప్రాంగణంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంగళవారం పని చేస్తుండగా, ఐదో అంతస్థు నుంచి ఇనుప రాడ్డు తలపై పడింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని మొదట సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి, ఆ తర్వాత గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి అతడు మరణించాడు. మృతుడి బావ రామ్‌లాల్ కుమార్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

హైటెక్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మాదాపూర్ ఎస్ఐ బలరాం తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వ్యక్తి ఈనెల 13న రాత్రి తాడి కాంపౌండ్ సిగ్నల్ నుంచి పర్వత్‌నగర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనక నుంచి అతివేగంగా ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది అక్కడకు చేరుకుని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి కుడిచేతిపై హిందీలో మహదేవ్ అనే అక్షరాలు ఉన్నాయని, వివరాలు తెలిసిన వారు మాదాపూర్ పోలీసులకు 87126 63119లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

భార్యతో వాగ్వాదం.. వ్యక్తి ఆత్మహత్య

నార్సింగ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంబీ రాములు(52) భార్య ఉమా రాణితో కలిసి రాందేవ్‌గూడలో నివాసం ఉంటున్నాడు. రాములు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. అప్పుల బాధ తాళలేక మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈనెల 14న భార్యతో వాగ్వాదం జరిగింది. రాములు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బుధవారం మంచిరేవుల గ్రామంలోని గోపాలస్వామి ఆలయ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని స్థానికులకు కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి భార్య ఉమా రాణికి సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎటుచూసినా గుంతలమయమే!

అధ్వాన రోడ్లతో వాహనదారుల అవస్థలు ● ట్రాఫిక్‌కు అంతరాయం

పద్మారావునగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా మారిన రోడ్లతో ప్రజలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి ముషీరాబాద్ చౌరస్తా ప్రధాన రోడ్డులో కంకరతేలి గుంతలమయంగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానరోడ్డు కావడంతో అటు ముషీరాబాద్ నుంచి ఇటు ట్యాంకుబండ్, కవాడిగూడ నుంచి నిరంతరం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముషీరాబాద్ చౌరస్తా వద్ద మెట్రో పిల్లర్ నంబర్ బి1043 వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు గుంతలమయమై కంకరతేలిన రోడ్డు కారణంగా నిరంతరం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య మరీ తీవ్రతరమవుతోంది. దీనివల్ల వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలమయమైన రోడ్ల స్థానంలో నూతన రోడ్డు వేయకున్నా కనీసం ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదని, ప్రజా సమస్యలను గాలికొదులుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాల్సిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్మాణ వ్యర్థాలతో రోడ్డులోని గుంతలను పూడ్చి చేతులు దులుపుకుంటున్నారు. ప్రధాన దారిలో వాహనదారులు, పాదాచారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు నిర్లక్ష ధోరణికి స్వస్తిపలికి వెంటనే రోడ్డు మరమ్మతులను చేపట్టి, ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.


కంకరతేలిన ముషీరాబాద్ ప్రధాన రోడ్డు


నిర్మాణ వ్యర్థాలతో పూడ్చిన రోడ్డు గుంతలు


గుంతలమయంగా మారిన రోడ్డు


ఇందిరానగర్‌కాలనీలో కలుషిత నీటి సమస్యపై జలమండలి అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీ రోడ్డు నంబర్-3లో కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. బుధవారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ ఇందిరానగర్‌కాలనీలో పర్యటించారు. వాటర్‌లైన్ దగ్గర కరెంట్ స్తంభం ఉందని, దీంతో వాటర్‌లైన్‌కు మరమ్మతులు చేయాలంటే ఇబ్బంది అవుతుందని జలమండలి సిబ్బంది తెలియజేశారు. దీంతో కార్పొరేటర్ విద్యుత్‌శాఖాధికారులతో మాట్లాడి కరెంట్ స్తంభాన్ని మార్చాలని కోరారు. వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె స్థానికులకు హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ కుశాల్‌కుమార్, స్థానిక బస్తీనాయకుడు ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బోయినపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్‌ను బోయినపల్లిలోని ఓ కుటుంబానికి చెందిన వారికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి సహాయాన్ని అందించారు. బోయినపల్లి కంసారిబజార్‌కు చెందిన బోయిన స్వప్నకు రూ.60 వేలు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం మంజూరైంది. ఈ చెక్కును బోయినపల్లి బీఆర్‌ఎస్ క్యాంప్ కార్యాలయంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి బుధవారం బాధితురాలి భర్తకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, నర్సింగ్ రావు, సురేష్ పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో విద్యార్థులకు నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పీపీటీ ప్రజంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు పాట పాడి వినిపించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ లక్ష్మణ్, టీటీఐ బేగంపేట ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, ఎస్‌వీఐటీ ప్రెసిడెంట్ పిఎల్ శ్రీనివాస్‌రావు, నరేష్ యాదవ్, ప్రిన్సిపాల్ ఈశ్వర్‌దరా, ఫిజికల్ డైరెక్టర్ పండరి తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలో పాల్గొన్న గాంధీ మెడికల్ కాలేజీ అధ్యాపకులు

గాంధీ మెడికల్ కాలేజీలో క్రికెట్ పోటీలు

అడ్డగుట్ట అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గాంధీ మెడికల్ కాలేజీ డే ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహిళా అధ్యాపకుల క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. గాంధీ వైద్యులు కిరణ్ మాదల, అబ్బయ్య, లెనిన్, అపూర్వరెడ్డిల సారథ్యంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు. చంద్రవతి 11 టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించింది. తొలి ఇన్నింగ్స్‌లో వారు 6 ఓవర్లలో 68/1 పరుగులు సాధించారు. ప్రత్యర్థి దీప్తి 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ క్రీడా పోటీల్లో శ్రేయా 38 పరుగులు, మాధురి 34 పరుగులు, రేఖా 30 పరుగులు, సుచరిత 16 పరుగులు, బౌలింగ్‌లో దీప్తి ఒక వికెట్ తీసింది. క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించడంలో విశేషంగా కృషి చేసిన గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిలకు క్రీడాకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గాంధీలో నిర్వహించిన సీపీఆర్ అవగాహన ర్యాలీ

గాంధీలో సీపీఆర్ అవగాహన ర్యాలీ

అడ్డగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గాంధీ మెడికల్ కాలేజీలో బుధవారం మూడవ రోజు సీపీఆర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేజీ నుంచి గాంధీ ఆస్పత్రి ఓపీ వరకు వైద్యులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిలతో పాటు వైద్యులు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్, వైద్యులు మురళీ, కిరణ్ మాదల, సుధారాణి, అబ్బయ్య, జూబేర్‌లతో పాటు పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సీపీఆర్‌పై ఉద్యోగులకు శిక్షణ

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశ్రిత రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సీపీఆర్‌పై జరిగిన అవగాహన సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకళతో కలిసి పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి అవసరమైన నైపుణ్యాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టార్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ మౌనిక మాట్లాడుతూ వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స సీపీఆర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, సిబ్బంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ గెలుపు ఖాయం

బౌద్ధనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తిలు అన్నారు. బుధవారం వారు సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులతో కలిసి దీపక్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ సికింద్రాబాద్‌కు చెందిన సుమారు 38మంది నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డలో మూడునెలల నుంచి బీజేపీ గెలుపుకోసం పనిచేస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పై విసుగు చెందిన ప్రజలు బీజేపీకి పట్టంకట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హరి, గణేశ్ ముదిరాజ్, ప్రభు గుప్తా, శారద మల్లేష్, కొల్లి నాగేశ్వరరావు, ఆకారం రమేష్, అంబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.


లంకల దీపక్‌రెడ్డిని సత్కరిస్తున్న మహంకాళి సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి

నివాళులు



భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారం బౌద్ధనగర్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.రవిప్రసాద్‌గౌడ్, నాయకులు రమణ, శ్యామ్, ఉపేందర్, సంపత్ తదితరులు.
- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి


భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి బుధవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.
- తార్నాక,ఆంధ్రజ్యోతి

హక్కుల సాధనకు రెడ్డి జేఏసీ పోరాటం

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా రాజ్యాంగ, చట్టబద్ధ హక్కుల కోసం రెడ్డి జేఏసీ పోరాటం చేస్తుందని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదని వారు ఆరోపించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి ప్రతినిధులు మాట్లాడుతూ 1992లో ఇంద్రసహాన్ని జడ్జిమెంట్‌లో యాభై శాతం రిజర్వేషన్లు దాటకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, 1994లో కృష్ణమూర్తి బీసీ రిజర్వేషన్లు ఇవ్వకూడదని సుప్రీంకోర్టుకు వెళ్తే యాభై శాతం దాటకూడదని చెప్పిందని, అలాగే 2019లో రిజర్వేషన్లు పెంచి ఎన్నికలకు పోవడం వలన ఎన్నికలను రద్దు చేసిందని గుర్తుచేశారు. బిహార్‌లో యాభై శాతం మించి రిజర్వేషన్‌తో స్థానిక లోకల్ బాడీ ఎన్నికలకు వెళ్తే కోర్టు స్టే ఇచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని సవరణ చేయకుండా రాష్ట్రంలో సపరేటు రిజర్వేషన్లను తీసుకొచ్చి ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి, కో చైర్మన్ పైళ్ల హరినాథ్ రెడ్డి, ఉత్తర తెలంగాణ అధ్యక్షులు పెండ్యాల రాంరెడ్డి, జిల్లాల నుంచి రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు


మాట్లాడుతున్న సదస్సు డైరెక్టర్ ప్రొ. చెన్నప్ప

ఓయూలో గ్లోబల్ టూరిజంపై అంతర్జాతీయ సదస్సు

● నేటి నుంచి మూడు రోజులు నిర్వహణ
● హాజరుకానున్న మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించే దిశగా "గ్లోబల్ టూరిజం - న్యూ అవెన్యూస్ ఫర్ సస్టెనబుల్ డెవలప్‌మెంట్" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఉస్మానియా యూనివర్శిటీలోని ఠాగోర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నారు. బుధవారం ఓయూలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సదస్సు చైర్మన్, కామర్స్ విభాదిపతి ప్రొ.గంగాధర్, డైరెక్టర్ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ చెన్నప్ప వివరాలు వెల్లడించారు. ఈ సదస్సు అక్టోబరు 16 నుంచి 18 వరకు హైబ్రిడ్ మోడ్‌లో జరుగుతుందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సదస్సులో ప్రపంచ, దేశ, రాష్ట్ర పర్యటకంపై వక్తలు చర్చించనున్నారని, దేశవ్యాప్తంగా సుమారు 200 మంది హాజరు కానున్నారని ఆయన తెలిపారు.


శివశంకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న సాయిమధుకర్

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా కన్వీనర్‌గా శివశంకర్

ఎర్రగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్‌గా ఎర్రగడ్డకు చెందిన ఎస్.శివశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ విభాగం చైర్మన్ సాయిమధుకర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిమధుకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించడంలో కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం కీలకపాత్ర పోషించాలని సూచించారు. శివశంకర్ మాట్లాడుతూ పార్టీ నాయకులను జిల్లా పరిధిలో ఏకతాటిపై నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ నాగంగారి ప్రీతం, సికింద్రాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఏఎస్ పదోన్నతుల్లో 48 మందికి అన్యాయం

● ఆర్ట్స్ కాలేజీ నుంచి ర్యాలీతో నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ క్యారియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) పదోన్నతుల్లో విశ్వవిద్యాలయానికి చెందిన 48మంది అధ్యాపకులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అధ్యాపకులు బుధవారం ఆర్ట్స్ కాలేజ్ నుంచి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఔటా అధ్యక్షుడు డా.మనోహర్ మాట్లాడుతూ, ఇంటర్వ్యూలలో పనితీరు బాగాలేదని చెప్పి అధ్యాపకులను రిజెక్ట్ చేయడం సమంజసం కాదన్నారు. గడచిన 50 ఏళ్లలో ఇలాంటి రిజెక్షన్ ఉదంతం జరగలేదని, గతంలో ఒకరిద్దరిని మాత్రమే కొన్ని కారణాలతో రిజెక్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈసారి ఏకంగా 48మందిని రిజెక్ట్ చేయడం దారుణమన్నారు. ఉత్తమ అధ్యాపకులు, పరిశోధకులు కూడా ఈ జాబితాలో ఉండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. అన్ని అర్హతలు ఉన్న అధ్యాపకులకు ప్రమోషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, ఓయూ వీసీని ఆయన కోరారు. అనంతరం ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, ఓఎస్‌డీ జితేందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేందర్‌రెడ్డి, వెంకట్‌దాస్, రమేష్ బాబు, డా.అరవింద్, శశికళ, డా.అపర్ణ, గంగాధర్, రామచందర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఔటా నాయకులు, ప్రొఫెసర్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

● ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల పట్ల పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు వినియోగంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి బహుమతులు, ఇతర ఆశలు చూపి ఓటీపీలు అడుగుతారని, వాటిని నమ్మవద్దని, ఓటీపీలు ఎవ్వరికి చెప్పవద్దని సూచించారు. వీడియో కాల్స్ చేసి డిజిటల్ అరెస్ట్‌పేరుతో భయాభ్రాంతులకు గురి చేస్తారని, అలాంటి నమ్మవద్దని వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు. ఇటీవల యువత డ్రగ్స్ బారిన పడుతున్నారని, మాదకద్రవ్యాల వాడకం పట్ల ప్రాణాలకే ప్రమాదమన్నారు. మాదకద్రవ్యాలు అమ్మినా, వాడినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై సుధాకర్, ఎస్సై రామచంద్రారెడ్డి, బాలాజీ స్కూల్ కరస్పాండెంట్ సుధేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడ్‌బండ్ దేవాలయ హుండీ లెక్కింపు

బోయినపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ ఆంజనేయస్వామి దేవస్థాన హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరేందర్ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సీసీ కెమెరాల, పోలీసుల నిఘాలో దేవాదాయ అధికారులు, సిబ్బంది, భక్తుల సమక్షంలో హుండీ లెక్కించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయానికి విరాళాలు అందించాలనుకునే భక్తులు కార్యాలయంలో సంప్రదించి రశీదులు పొందాలని, ఇతరులను నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా ఆలయ ఈఓ నరేందర్ మీడియాకు వెల్లడించారు.